



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో గురువారం క్వింటాలు నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,600, గరిష్ట ధర రూ.3600, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,225 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,198 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

గణేశ్ నిమజ్జనంలో అడిషనల్ అడ్వకేట్ జనరల్

108 కేజీల లడ్డూ రూ.9 లక్షలు



తాడేపల్లి రూరల్ : ఉండవల్లిలో గురువారం రాత్రి గణేశుని నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా 108 కేజీల లడ్డూ వేలం పాట నిర్వహించారు. కుంచనపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆరుమళ్ల చంద్రశేఖరరెడ్డి రూ.9 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు. ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. గణేశుని నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జన వాహనాన్ని ఆయనే స్వయంగా ముందుకు నడిపారు. తర్వాత విగ్రహదాత తమ్మా సుబ్బారెడ్డి, గంటు బాలాజీరెడ్డి, కళ్లం సాంబిరెడ్డి, గణేష్ యూత్ సభ్యులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని సన్మానించారు.

కొండవీడు పర్యాటకాభివృద్ధికి కృషి

యడ్లపాడు: సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా కొండవీడు పర్యాటక కేంద్రంలో సరికొత్త ప్రాజెక్టులను రూపొందించాలని ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (గుంటూరు) వై.శ్రీనివాసరెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. యడ్లపాడు మండలంలోని చారిత్రక ప్రాంతం కొండవీడుకోటను గురువారం ఆయన సందర్శించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కొండవీడు–నగరవనం ద్వారా ప్రతినెలా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్షించి పలు సూచనలు చేశారు. సుమారు రూ.3 కోట్ల అంచనాతో చేయాల్సిన కొండవీడు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికల రూపకల్పనకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారి రమణమ్మ, డీఆర్వో పి.నీలిమాదేవి, కొండవీడు బీట్‌ఆఫీసర్ ఎన్.పురుషోత్తమరాజు, ఏబీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎస్టీ నంబరు బోర్డు ఏర్పాటు చేయాలి

నరసరావుపేట: రాష్ట్రం అంతటా డెకాయ్ ఆపరేషన్ జరగబోతున్న తరుణంలో ప్రతి వ్యాపార సంస్థ జీఎస్టీ నంబరు కనపడేలా ఏర్పాట్లు చేసి ప్రతి అమ్మకానికి బిల్లు ఇవ్వాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, గాదంశెట్టి రామకృష్ణ గురువారం సూచించారు. లేనిపక్షంలో రూ.20 వేలు జరిమానా చెల్లించే పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, వారి సభ్యులకు తెలియచేసి అప్రమత్తం చేయాలని కోరారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు.ఏపీ.ఇన్/ఎంహెచ్2023 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

7న మహిళా కళాశాలలో జాబ్ డ్రైవ్

గుంటూరు ఎడ్యుకేషన్ : సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డైకిన్ సంస్థలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆపరేటర్, లైన్ సూపర్‌వైజర్లుగా 150 పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లో డిగ్రీ విద్యార్హతతోపాటు 18 నుంచి 24 ఏళ్ల వయసు గల మహిళా అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. తమ వెంట బయోడేటా, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని తెలిపారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పర్యటన

విజయవాడ: దసరా ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చెప్పారు. దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంపై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లను డీసీపీ విశాల్‌గున్నీ, ఏఐజీ ఎం.రవీంద్రబాబు, దుర్గగుడి ఈఓ భ్రమరాంబ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



- ఆసియా క్రీడల్లో మెరిసిన తెలుగు తేజం జ్యోతి సురేఖ
- కాంపౌండ్ మిక్స్‌డ్, కాంపౌండ్ ఉమెన్ టీమ్‌లో సత్తా
- రెండు స్వర్ణ పతకాలు సాధించిన స్టార్ ఆర్చర్

అంతర్జాతీయ వేదికపై తెలుగు తేజం జ్యోతి సురేఖ మరోసారి మెరిసింది. 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ విభాగంలో రెండు స్వర్ణ పతకాలను సాధించింది. మూడో స్వర్ణంపై గురిపెట్టింది. డబుల్ ధమాకాతో రాణించిన ఈ తెలుగుబిడ్డ వ్యక్తిగత విభాగంలోనూ స్వర్ణ పతకం సాధిస్తుందని ప్రతి ఒక్కరూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతి సురేఖ.. డబుల్ ధమాకా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్ట్రానికి చెందిన అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ 19వ ఆసియా క్రీడల్లో ఆర్చరీ పోటీల్లో రెండు స్వర్ణాలతో సత్తాచాటింది. చైనాలోని హాంగ్జౌలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా బుధవారం ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే–జ్యోతి సురేఖ ద్వయం దక్షిణ కొరియాకు చెందిన సో చేవన్–జేహూన్ జూ జోడీపై గెలిచి స్వర్ణ పతకం సాధించింది. గురువారం జరిగిన ఆర్చరీ కాంపౌండ్ ఉమెన్ విభాగంలో జ్యోతి సురేఖ ఫైనల్‌లో విజేతగా నిలిచి స్వర్ణం గెలుచుకుంది. వ్యక్తిగత విభాగంలో శనివారం జరిగే ఫైనల్స్‌కు సురేఖ చేరింది. 19వ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించిన తెలుగు అమ్మాయిగా వెన్నం జ్యోతి సురేఖ రికార్డు సృష్టించింది.

పురస్కారాలు ఎన్నెన్నో...

జ్యోతి సురేఖ ఇప్పటి వరకు ఎన్నో పతకాలు గెలుచుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆర్చరీ పోటీల్లో 50కు పైగా మెడల్స్‌ను సాధించింది. జాతీయ స్థాయిలో 40 బంగారు, 13 రజతం, 9 కాంస్య పతకాల చొప్పున 62 మెడల్స్ సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో 17 బంగారు, 18 రజత, 15 కాంస్య పతకాలను జ్యోతి సురేఖ దక్కించుకుంది. మరిన్ని పతకాలే లక్ష్యంగా నిత్యం ప్రాక్టీస్ చేస్తోంది.



తల్లిదండ్రులు శ్రీదుర్గ, సురేంద్ర కుమార్‌తో జ్యోతి సురేఖ (ఫైల్)

ప్రతిభకు గుర్తింపు

ప్రపంచ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని చాటుతున్న జ్యోతి సురేఖ సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి 2022 డిసెంబర్ 19వ తేదీన ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు. అదే రోజు జ్యోతి సురేఖకు గ్రూప్–1 (డెప్యూటీ కలెక్టర్) ఉద్యోగం ఇచ్చి గౌరవించారు. 2017లోనే అర్జున అవార్డు జ్యోతి సురేఖను వరించింది. 2018 సంవత్సరంలో ఇండియన్ అన్‌బాండ్ ఎక్స్‌లెన్సీ అవార్డు, ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో 'సాక్షి' మీడియా యంగ్ అచీవర్ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిభా పురస్కారం, 2018లో జీ టీవీ నుంచి అప్సర అవార్డు, 2014లో అక్కినేని ఫౌండేషన్ క్రీడా రత్న అవార్డును సురేఖ అందుకుంది.

చాలా సంతోషంగా ఉంది

మా జ్యోతి సురేఖ ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఆసియా క్రీడా పోటీల్లో విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. జ్యోతి సురేఖ ఆ ఒత్తిడిని తట్టుకుని చాలా ఏకాగ్రతతో ఆడుతోందని కోచ్‌లు మెచ్చుకున్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకర్‌గా ఎదగాలని నిత్యం సాధన చేస్తూనే ఉంటుంది. రాష్ట్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయి ఆర్చరీ క్రీడాకారులను తయారు చేసి దేశానికి మరింత పేరు తేవాలనేది జ్యోతి సురేఖ ఆకాంక్ష.

– శ్రీదుర్గ, సురేంద్రకుమార్
(జ్యోతి సురేఖ తల్లిదండ్రులు)

ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- రావెలలో వైద్యశిబిరం పరిశీలన



వైద్య శిబిరంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

రావెల(తాడికొండ): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తాడికొండ మండలం రావెల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా వైద్యపరీక్షలను, ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన సూచనలు చేశారు. రోగులను పలకరించారు. నేత్ర వైద్యులు, రోగులతో మాట్లాడారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాలలోని విద్యార్థుల హాజరు, డ్రాపౌట్లపై ఆరా తీశారు. 3 నుంచి 10వ తరగతి వరకు 418 మంది చదువుకుంటుండగా వారిలో 350 మంది మధ్యాహ్న భోజనం తింటున్నారని హెచ్ఎం నాగమణి తెలిపారు. 70 శాతం మంది విద్యార్థులు మాత్రమే భోజనం తినడమేమిటని కలెక్టర్ ప్రశ్నించారు. నూరుశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావెల శైలజ, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, మండల ప్రత్యేకాధికారి సుధాకర్, తహసీల్దార్ ఫణీంద్ర బాబు, ఎంపీడీవో అత్తోట దీప్తి, వీఆర్వో బ్రహ్మయ్య, సర్పంచ్ శైలజ పాల్గొన్నారు.

విధేయతకు పట్టం



అప్పిరెడ్డిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు గిరి, ముస్తఫా, మేయర్ కావటి, పార్టీ నేతలు లాలుపురం రాము, నూరి ఫాతిమా, సురేష్‌కుమార్ తదితరులు

ఏపీ శాసన మండలి విప్‌గా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నియామకం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేంద్ర పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ల అప్పిరెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన బహుమతి అందించారు. సీఎం వైఎస్ జగన్ అడుగులో అడుగై విధేయతతో నడిచిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని శాసన మండలి విప్‌గా నియమించారు. ఫలితంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. 2014 ఎన్నికల్లో పార్టీ పశ్చిమ నియోజకవర్గ సీటును అప్పిరెడ్డికి కేటాయించారు. ఆ తరువాత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకునిగా అప్పిరెడ్డిని నియమించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి విప్‌గా నియమించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, లేళ్ళ అప్పిరెడ్డికి ఉన్న ప్రాధాన్యాన్ని చాటి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు అప్పిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచారు. తప్పెట్ల మోతతో నృత్యాలు చేశారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, షేక్ మొహమ్మద్ ముస్తఫా, తాడికొండ ఇన్‌చార్జ్ కత్తెర సురేష్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, మిర్చియార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభానీ, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ తదితరులు అప్పిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పిరెడ్డి మరిన్ని పదవులు అలంకరించాలి : తలశిల



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాసన మండలిలో విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం అభినందించారు. నగరంలో ఓ హోటల్‌లో అప్పిరెడ్డిని గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని రఘురాం ఆకాంక్షించారు. పార్టీలో అంకిత భావంతో పనిచేసేవారికి పదవులు వాటంతట అవే వస్తాయన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మంత్రి విడదల రజిని

- పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 20 వేల ఓపీ సేవలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి రజిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. వైద్య కళాశాలల నిర్మాణం, నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రుల ఆధునికీకరణ చేపడుతోందని వెల్లడించారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం ద్వారా అందరికీ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పల్నాడు జిల్లాలో 385 వైద్య శిబిరాలు నిర్వహించబోతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలో 72 వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. జిల్లాలో 20వేల ఓపీ సేవలు ఇప్పటి వరకూ నమోదు కాగా.. నాణ్యమైన వైద్యం కోసం 510 మందిని పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని తెలిపారు. 139 మంది స్పెషలిస్టు వైద్యులు సురక్ష వైద్య శిబిరాల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో 39 వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నామని, ఇప్పటివరకూ 8 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 1,637 ఓపీ సేవలు నమోదు కాగా వీరిలో 56 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నగరవనం.. సుమనోహరం



స్వాగతం.. సుస్వాగతం : టెంపుల్ హిల్ ఏకో పార్కు ముఖద్వారం



'ట్రాక్'రికార్డు : ట్రెక్కింగ్ ట్రాక్‌పై నడుస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎంపీ అయోధ్యరామిరెడ్డి

మంగళగిరి: ప్రకృతి పరువాలు పరుచుకున్నట్టు.. రెండు కొండల మధ్య కొలువైన సుమనోహర ప్రాంతం.. పచ్చలహారాలు ధగధగలాడుతున్నట్టు అపురూప వృక్ష సంపదకు ఆలవాలమైన సుందర వనం.. సుస్వరాలేవో చెవులను సుతారంగా తాకుతున్నట్టు.. చల్లని పవనాలతో జతకట్టి.. కిలకిలారావాలు చేసే పక్షిజాతుల సమాహారం.. అడుగడుగునా ఆహ్లాదం పంచే వాతావరణం.. అబ్బురపరిచే అందాల రమణీయం.. సందర్శకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. పిల్లలకు, పెద్దలకు ఆనందానుభూతులు పంచుతాయి. మంగళగిరిలో ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన నగరవనం(టెంపుల్ హిల్ ఎకో పార్కు) పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తోంది. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి కొండను ఆనుకుని నెలవైన ఈ నగరవనానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆధ్వర్యంలో అటవీ, పర్యాటక శాఖ అధికారులు సంయుక్తంగా సరికొత్త నగిషీలు చెక్కారు. అధునాతన సొబగులద్దారు. ఈ పార్కును ఇటీవలే రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే అట్టహాసంగా ప్రారంభించారు.

మరింత అభివృద్ధి చేస్తాం

మంగళగిరిలో ఏర్పాటు చేసిన నగరవనం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొన్ని సంస్థలు ఇక్కడ గెట్ టు గెదర్ కూడా ఏర్పాటు చేసుకుంటున్నాయి. రానున్న రోజుల్లో ఈ పార్కును మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
ఎమ్మెల్యే, మంగళగిరి


ప్రత్యేకతలివే..

అరకును తలపించేలా ఐదు కిలోమీటర్ల మేర పర్వతారోహణ మార్గాన్ని తీర్చిదిద్దారు.

- కొండ దిగువన పచ్చటి చెట్ల మధ్య 50 ఎకరాల విస్తీర్ణంలో నగరవనం తీర్చిదిద్దారు. రూ.60 లక్షలతో వసతులు కల్పించారు.
- కొండపై రెండు కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం చేశారు.
- వ్యాయామశాల, చిన్నారులకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు.
- నక్షత్ర, నవగ్రహ, రాశి, పంచవటిల పేర్లతో ఔషధ మొక్కలతో కూడిన సుమనోహర రాశి వనాలను ఏర్పాటు చేశారు.

వివాహితపై హత్యాయత్నం

గుంటూరు ఈస్ట్ : వివాహితపై పట్టపగలు హత్యాయత్నం జరిగిన ఘటన గుంటూరు నగరంలో కలకలం రేపింది. బాధితురాలు రాజా మధుకుమారి కథనం ప్రకారం.. మధుకుమారికి శ్రావణకీర్తి అనే వ్యక్తితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. శ్రావణకీర్తి కర్నూలులో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చాయి. మధుకుమారి తన కుమారుడితో కలిసి ఎస్.వీ.ఎస్.కాలనీలో నివాసం ఉంటున్నారు. గురువారం మధుకుమారి తన కుమారుడిని ద్విచక్ర వాహనంపై పాఠశాల వద్ద దించి తిరిగి వస్తున్న క్రమంలో ఎల్ఐసీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెనుకగా వచ్చి ఢీకొట్టారు. దీంతో మధుకుమారి కింద పడ్డారు. ముగ్గురిలో ఓ వ్యక్తి చాకుతో మధుకుమారిపై దాడి చేశాడు. విచక్షణ రహితంగా పది చోట్ల పొడిచాడు. అనంతరం ముగ్గురూ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు మధుకుమారిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. ఈ సందర్భంగా మధుకుమారి మాట్లాడుతూ తనకు భర్తతో విభేదాలు ఉన్నాయని, వారం క్రితం ఇమాం బాషా అనే వ్యక్తి వచ్చి రాజీ కుదురుస్తానని చెప్పాడని, దీనికి నిరాకరించడంతో తనపై హత్యాయత్నం జరిగిందని వివరించారు. దాడి చేసిన వారిని తాను గుర్తించలేకపోయానని వెల్లడించారు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మధుకుమారి

క్లుప్తంగా

8న తెనాలిలో జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

తెనాలి: జిల్లా సీనియర్ మహిళలు, జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ఈనెల 8వ తేదీన తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన సీనియర్ మహిళల జట్టు, జూనియర్ బాలు జట్టు ఈనెల 14,15,16 తేదీల్లో కడప జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో సహా ఆరోజు మధ్యాహ్నం కోచ్ కె.నాగరాజుకు రిపోర్టు చేయాలని కోరారు.

యార్డులో 37,007 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 35,215 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 37,007 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,700 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 11,506 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బార్ అసోసియేషనా? టీడీపీ కార్యాలయమా?

- మంత్రిని దూషించిన వారిని సత్కరిస్తారా!?
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌పై మండిపడ్డ న్యాయవాదులు
- జిల్లా కోర్టులో అసోసియేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ లీగల్ విభాగ సభ్యుల నిరసన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పోలూరి వెంకటరెడ్డి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను అసభ్య పదజాలంతో దూషించిన కేసులో వ్యక్తిగత పూచీకత్తు బెయిల్‌పై బయటకు వచ్చిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆయన చాంబర్‌లో సన్మానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోలూరి వెంకటరెడ్డి చెప్పారు. గురువారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఏ విధంగా బండారు సత్యనారాయణను సన్మానిస్తారని ప్రశ్నించారు. బండారుతో పాటు బెయిల్‌పై బయటకు తీసుకుని వచ్చిన అతని న్యాయవాదులను సత్కరించాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. న్యాయం పరిరక్షించాల్సిన న్యాయవాదులే ఈ విధంగా వ్యవహరించటం సరి కాదన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నేతలు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పూర్తిస్థాయిలో నిరసన తెలియజేసిన పరిస్థితుల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. అయితే తాను ఎటువంటి క్షమాపణ చెప్పనని సురేష్ సైతం ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయటంతో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం, న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఎట్టి పరిస్థితుల్లో క్షమాపణ చెప్పాల్సిందేనని, లేకుంటే నిరసన విరమించే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం, న్యాయవాదుల ఆందోళనతో దిగి వచ్చిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ హత్యలు, దొంగతనాలు చేసే వారికి కూడా సన్మానాలు చేస్తారా? అని ప్రశ్నించారు. సుమారు రెండు వేల మంది న్యాయవాదులు ఉన్న బార్ అసోసియేషన్‌ను తెలుగుదేశం పార్టీ కార్యాలయంగా మార్చారని మండిపడ్డారు. వ్యవస్థల్లో తప్పుడు పనులు చేసిన వ్యక్తులకు అండగా నిలవటం లేదని సరికాదని స్పష్టం చేశారు. ఇటువంటి మరోమారు పునరావృతమైతే ఉరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యులు, న్యాయవాదులు బడి మంజుల, ఇందిరా, బాలత్రిపుర సుందరి, మాధవి, జోత్స్న, నజీరా వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, కళ్ళం రమణా రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, వజ్రాల రాజశేఖర్ రెడ్డి, కాసు వెంకటరెడ్డి, సూరిబాబు, సుబ్బారెడ్డి, బి.కోటేశ్వరరావు, కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, బి.సాగర్, జింబో, శరత్, వేముల ప్రసాద్, అనిల్, సుబ్బారావు, క్రాంతి సుదర్శనం, పాపిరెడ్డి, దివాకర్, శ్రీనివాస్ రెడ్డి, అజీజ్, దాసరి శ్రీనివాసరావు, పల్లపు కృష్ణ, మొండితోక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్ పట్ల అసభ్య ప్రవర్తన

దాచేపల్లి: మహిళా వలంటీర్ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రశ్నించిన ఆమె కుటుంబ సభ్యులపై ఆ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన దాచేపల్లిలోని లైబ్రరీ సెంటర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గోను దుర్గా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె ఇంటి ఎదురుగా షేక్ జానీబాషా నివసిస్తున్నాడు. పలుమార్లు వలంటీర్ పట్ల జానీబాషా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయాన్ని వలంటీర్ దుర్గా కుటుంబ సభ్యులకు చెప్పింది. ప్రశ్నించేందుకు వెళ్లిన వలంటీర్ తల్లి ఈశ్వరమ్మతోపాటుగా మరో ముగ్గురిపై జానీబాషా కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయాలు కావటంతో రక్తస్రావమైంది. పోలీసులు జానీబాషాను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎంత ఉద్దీపనమో!?

- సస్పెండ్ అయినప్పటికీ తిరిగి విధుల్లోకి మెప్మా సీఎంఎం!
- తప్పుడు పత్రాలతో రుణం తీసుకున్న మెప్మా సిబ్బంది
- సాక్షి కథనాలతో సీఎంఎం దీపపై వేటు
- రుణం పూర్తిగా రికవరీ చేయకుండానే మళ్లీ విధుల్లోకి!!
- మెప్మా అధికారుల తీరుపై ఆరోపణలు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): మెప్మాలో ఎంత పెద్ద తప్పు చేసినా అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు ఆ తప్పును కప్పి పుచ్చేస్తారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ సంఘటనే. కొద్ది నెలల క్రితం ఆటోనగర్ యూనియన్ బ్యాంక్‌కు కుచ్చుటోపి రూ.1.05 కోట్ల రుణం తీసుకుని దానిని తిరిగి చెల్లించకపోవడంతో విషయం బయటకు పొక్కింది. విషయం రచ్చ కావడంతో సాక్షిలో రెండు నెలల కిత్రం కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికారులు విచారణ చేపట్టి నిజమని తేలడంతో సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) దీపను సస్పెండ్ చేశారు.

అయితే బ్యాంకు నుంచి తీసుకున్న రుణం పూర్తిగా జమ కాకుండానే దీపను తిరిగి విధుల్లోకి తీసుకోవడంపై మెప్మా అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.


మెప్మా కార్యాలయం

జరిగిన విషయం ఏమిటంటే..

వేరే బ్యాంకులో లోన్లు తీసుకున్న 8 గ్రూపులను తిరిగి ఆటోనగర్ యూనియన్ బ్రాంచ్ మేనేజర్‌ను కలిసి లోన్లు ఇప్పించాలని ఆర్‌పీలు, సీఎంఎం కోరారు. దీనిపై సదరు బ్యాంకు మేనేజర్ ఆర్‌పీలు, సీఎంఎం బురిడి కొట్టించి 8 గ్రూపు సభ్యులు ఎక్కడా బ్యాంకు రుణం తీసుకోలేదని తప్పుడు ధ్రువ పత్రాలు చూపి రూ.కోటి 5 లక్షల వరకు లోన్ మంజూరు చేయించుకున్నారు. ఇందులో కొసమెరుపేమిటంటే పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సీఎంఎం గుంటూరు తూర్పు నియోజకవర్గానికి వచ్చి మరి బ్యాంకును బురిడీ కొట్టించి రుణం తీసుకున్నారు. లోన్ రికవరీ జరగక పోవడంపై లోతుగా విచారణ చేసిన మేనేజర్‌కు విస్తుపోయే నిజాలు తెలుసుకుని మెప్మా పీడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై గత మే నెలలో పలు కథనాలు రావడంతో సీఎంఎం దీపను సస్పెండ్ చేశారు.

మెప్మాపై ఆరోపణలు

అయితే రుణం పూర్తిగా చెల్లించకుండానే దీపను విధుల్లోకి తీసుకోవడంపై మెప్మా అధికారులపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకుకు రూ.70 లక్షల మాత్రమే జమైంది. ఇంకా 35 లక్షలు పెండింగ్‌లో ఉంది. పూర్తిగా లోన్ జమ అయిన తరువాతనే విధుల్లోకి తీసుకోవాల్సి ఉండగా అధికారులను మేనేజ్ చేసుకుని విధుల్లోకి చేరిందనే ఆరోపణలు ఉన్నాయి. మొదట సదరు సీఎంఎం మర్కాపురానికి కేటాయించగా అక్కడ మాకొద్దని చెప్పడంతో తిరిగి మాచర్ల వెళ్లాలని సూచించారు. అక్కడ కూడా వద్దని చెప్పడంతో చేసేదేమీ లేక గుంటూరు మెప్మా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

సస్పెన్షన్‌కు గురైన దీపను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి విధుల్లోకి తీసుకున్నాం. ప్రస్తుతం ఆమెను బ్యాంక్ లోన్ రికవరీ చేయాలని సూచించాం. ఆమెకు ఎటువంటి పోస్ట్ కేటాయించ లేదు.

– వెంకట నారాయణ, పీడీ, మెప్మా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇసుక దర్శి గ్రామంలో గురువారం రాత్రి వెలుగు చూసింది. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన జాన్‌వలి మద్యానికి బానిసై అప్పులు చేశాడు. దీంతో అప్పుల విషయం ఇంట్లో తెలుస్తుందని మనస్తాపంతో బుధవారం ఉదయం వలపర్ల గ్రామ పరిధిలోని పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బంధువులు మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ప్రైవేటు బ్యాంకు వేధింపులు తాళలేక మహిళ మృతి

న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

పొన్నూరు: ప్రైవేటు బ్యాంకు వేధింపులతో మనస్తాపానికి గురై గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గత ఏడాది చింతలపూడికి చెందిన పి. మరియమ్మ తన ఇల్లు తాకట్టు పెట్టి ఓ ప్రైవేటు బ్యాంకులో లోన్ తీసుకుంది. అయితే ఆమె నిరక్షరాస్యురాలు కావటంతో లోన్ మూడు లక్షలకు గాను రూ. 18 లక్షలు బ్యాంకు సిబ్బంది ఆమె ఖాతాలో జమ చేసి, పొరపాటున పడిందంటూ రూ. 15 లక్షలు రిటర్న్ తీసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఆమె తీసుకున్న మొత్తం రూ. 18 లక్షలంటూ, వడ్డీతో కలిపి రూ.22 లక్షలకు నోటీసు వచ్చింది. విషయాన్ని తెలుసుకున్న ఆమె దిగ్భ్రాంతికి గురై గుండె పోటుతో మరణించినట్లు తెలిసింది. ఆమె మృతికి కారణమైన బ్యాంక్ సిబ్బందిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో జీబీసీ రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.


రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

నేటి నుంచి డీఆర్ఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

- ప్రారంభించనున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి
- వివరాలు వెల్లడించిన రైల్వే డీఆర్ఎం రామకృష్ణ


ట్రోఫీలను ప్రదర్శిస్తున్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ, ఏడీఆర్ఎం శ్రీనివాస్,

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో మొట్టమొదటిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతర క్రీడాకారుల కోసం డీఆర్ఎం కప్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయ ప్రాగంణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న డీఆర్ఎం కప్ క్రీడా పోటీల్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి నల్లపాడు రైల్వే పెరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం సాయంత్రం 3గంటలకు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో డివిజన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, నల్గొండ, యాదాద్రి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని డీఆర్ఎం కప్ మొట్ట మొదటిసారిగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ పోటీల్ని 7,8,14,15వ తేదీల్లో, వాలీబాల్ పోటీల్ని ఈనెల 7,8 తేదీల్లో గుంటూరు పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.75 వేల క్యాష్ ప్రైజ్, రన్నర్స్‌కు రూ.50 వేలు అందించనున్నట్లు చెప్పారు. వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు ట్రోఫీతో పాటు విన్నర్స్‌కు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.5వేలు, తృతీయ స్థానానికి రూ.3వేలు, నాలుగో స్థానానికి రూ. 2వేలు అందించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇన్‌ఫ్రా శ్రీనివాస్, ఏడీఆర్ఎం ఆపరేషన్స్ సైమాన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ సీఎస్‌టీఈ బి.లక్ష్మణ్, సీనియర్ డీఈఈ మెయింటినెన్స్ సీహెచ్. దినేష్‌రెడ్డి, సీనియర్ డీఈఈ రవితేజ, సీనియర్ డీఎస్‌వో విజయకీర్తి, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌సీ కె.ఎస్.హర ప్రసాద్ పాల్గొన్నారు.

పసికందు అపహరణలో నిందితుల అరెస్టు

పట్నంబజారు: పసికందును అపహరించిన కేసులో ఇద్దరు మహిళలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నగరంలోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీకి చెందిన షేక్ రోష్ని గత నెల 26వ తేదీన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఈక్రమంలో ఆసుపత్రిలోని 106 వార్డులో వైద్యం నిమిత్తం ఉండగా, ఈనెల 3వ తేదీన రోష్ని నిద్రిస్తున్న సమయంలో నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన కంభాల లక్ష్మి అనే మహిళ ఎనిమిది రోజుల పసికందును అపహరించుకు పోయింది. ఎవరికి అనుమానం రాకుండా తనతోపాటు తెచ్చుకున్న సంచిలో చిన్నారిని పెట్టుకొని జీజీహెచ్ వద్ద ఆటో ఎక్కి పల్నాడు బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడి నుంచి బస్సులో నరసరావుపేట చేరుకుని తన స్వగ్రామానికి వెళ్లింది. సీసీ పుటేజీ ఆధారంగా బాలికను ఎత్తుకెళ్లిన కంభాల లక్ష్మిని గుర్తించి పట్టుకొని విచారించగా తాను తీసుకొచ్చిన చిన్నారిని అబ్బూరి వెంకటేశ్వరమ్మకు అప్పగించినట్లు తెలిపింది. అనంతరం పోలీసులు వెళ్లి వెంకటేశ్వరమ్మ ఇంట్లో ఉన్న చిన్నారిని సురక్షితంగా తీసుకుని గుంటూరు వచ్చారు. ఈక్రమంలో లక్ష్మిని విచారించగా, ఆమెకు అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చేందుకు తన బంధువు అయిన వెంకటేశ్వరమ్మకు పిల్లలు లేని క్రమంలో చిన్నారని ఇస్తే డబ్బులు ఇస్తుందనే కారణంతో ఎవరికి తెలియకుండా పసికందును అపహరించినట్లు తెలిపింది. దీంతోపాటు చిన్నారిని అపహరించేందుకు సహకరించిన వెంకటేశ్వరమ్మను కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చిన ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఎస్సై ఆంథోని, ఉమెన్ ఏఎస్సై కుమారి, హెడ్ కానిస్టేబుల్‌లు ఎల్.రవి, వీరభద్రం, కానిస్టేబుల్ శ్రీక్రాంత్, ఉమెన్ సీసీలను జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ అభినందించినట్లు తెలిపారు.

వేద సీడ్స్‌కు ఐఎస్ఓ గుర్తింపు

కొరిటిపాడు(గుంటూరు): క్వాలిటీ మేనేజ్మెంట్ సిస్టమ్ (క్యూఎంఎస్-నాణ్యవంతమైన నిర్వహణ) విభాగంలో వేదసీడ్స్‌కు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్ ద్వారా ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ లభించిందని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డా.పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన యాజమాన్య పద్ధతులతో అత్యుత్తమమైన మేలు జాతి విత్తనాలు అందిస్తున్న వేదసీడ్స్ ఈ సర్టిఫికెట్ పొందడం, రైతులు తమపై పెట్టుకున్న నమ్మకానికి ప్రతిరూపాలే ఈ ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా తమకు వచ్చిన అవార్డులని డాక్టర్ చంద్రశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు.



వేదసీడ్స్‌కు లభించిన ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్

సెక్యూరిటీ సంస్థకు నోటీసులు

- గైనిక్ వార్డులో సెక్యూరిటీ పెంపుదల
- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రెండు రోజుల కిందట పసికందు అపహరణకు గురైన కేసులో సెక్యూరిటీ ఏజెన్సీ సంస్థ పర్యవేక్షణ లోపాన్ని గుర్తించి షోకాజ్ నోటీసు ఇచ్చామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పసికందు అపహరణపై ఆ సమయంలో విధుల్లో ఉన్న ఆర్ఎంవోలు, గైనిక్ విభాగం హెచ్‌వోడీలు, ఇంచార్జిగా ఉన్న హెడ్ నర్సులకు నోటీసు ఇస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా 24 గంటల్లో మూడు షిఫ్ట్‌ల్లో పని చేసే ఆర్ఎంవోలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తల్లీబిడ్డలను డిశ్చార్జి చేసేటప్పుడు సంతకం తీసుకుని పంపించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యుడు ఇన్‌చార్జిగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తల్లీబిడ్డలకు ఆరోగ్యశ్రీలో ఫింగర్ ప్రింట్ వేసి ఫొటోను అప్‌లోడ్ చేసి వాహనంలో ఇంటికి పంపించే విధంగా సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆభరణాలు, సెల్ ఫోన్ల చోరీలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై పోలీసు శాఖకు లేఖ రాస్తున్నామని తెలిపారు. గైనిక్ 106, 107 వార్డుల్లో మహిళా కానిస్టేబుల్‌ను 24 గంటల పాటు ఉండే విధంగా నియమించాలని లేఖలో పేర్కొన్నట్లు వెల్లడించారు.

టీడీపీ నేత బండారు సత్యనారాయణ చిత్రపటాలు దహనం


పట్నంబజారు: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజాపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ అసభ్యకర పదజాలంతో తీవ్రంగా వ్యాఖ్యలు చేయడంపై మహిళాలోకం కన్నెర్ర జేసింది. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ ఆధ్వర్యంలో బండారు సత్యనారాయణ వ్యాఖ్యల్ని నిరసిస్తూ ఆయన చిత్రపటాల్ని చెప్పులతో కొట్టి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ మంత్రి రోజాపై చేసిన వ్యాఖ్యల్ని సత్యనారాయణ బేషరతుగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక పచ్చ పార్టీ నేతలు పిచ్చిపట్టిన కుక్కల్లా మొరుగుతున్నారని మండి పడ్డారు. బండారు సత్యనారాయణ వ్యాఖ్యల్ని వెనక్కు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు ఈపూరి వనజాక్షి, పిల్లి మేరి, కార్పొరేటర్ ఎ.పద్మావతి, ఉడుముల లక్ష్మి, నిమ్మరాజు శారద, స్వర్ణలత, రత్నకుమారి, శివపార్వతి, వెంకాయమ్మ, షేక్ ఖైరున్, శిరీష, కవిత పాల్గొన్నారు.


చిత్రపటాలను దహనం చేస్తున్న మహిళా విభాగం నేతలు

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలి అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. తెనాలిలో గురువారం ఆయన ఆరోగ్య సురక్ష సర్వేలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అయితానగర్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిందని చెప్పారు. అందరు క్యాంప్‌లకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి. రవికుమార్, సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పాల్గొన్నారు.


మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

విజ్ఞాన్ వర్సిటీకి కేంబ్రిడ్జి సౌత్ ఆసియా అవార్డు

చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లిష్ అసెస్‌మెంట్ విభాగం నుంచి సౌత్ ఆసియా బెస్ట్ స్టూడెంట్ సపోర్ట్ సెంటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించిందని వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్ గురువారం తెలిపారు. శ్రీలంక కొలంబోలో ఇటీవల జరిగిన "ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఫర్ సెంటర్ లీడర్స్ ఆఫ్ సౌత్ ఆసియా" అనే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసినట్లు వెల్లడించారు. దీంతో పాటు 2023లో కేంబ్రిడ్జి సౌత్ ఆసియా బెస్ట్ ప్రాక్టీసెస్ అండ్ సపోర్ట్ ఫర్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ అవార్డ్ లభించిందని ఆయన తెలిపారు. కొన్నేళ్లుగా కేంబ్రిడ్జి యూనివర్సిటీ నిర్వహిస్తున్న సర్టిఫికేషన్ కోర్సులకు తమ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారని, దాదాపు వంద శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారని ఆయన పేర్కొన్నారు.


కేంబ్రిడ్జి సౌత్ ఆసియా బెస్ట్ స్టూడెంట్ సపోర్ట్ సెంటర్ అవార్డ్‌ను అందుకున్న డీన్ శారద